# నమ్మకం నమ్మకాదు

-జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం

గత కొద్దిరోజులుగా నన్ను వేధిస్తోన్న ఓ వికృత రూపాన్ని, ఆ విచిత్ర స్వరాన్ని తిప్పికొట్టేమార్గం గోచరించింది. ఎదిరించే ధైర్యం కలిగిందిప్పుడు.

అంతమంది జనం మధ్యలోంచి లేచి 'యురేకా' అని అరవాలనిపించింది. ఆనందంతో చిందులు వేయాలనిపించింది.



ఓ కూచిపూడి, కథాకళి, మణిపురి, మరో భరతనాట్యం భంగిమల్లో ప్రదర్శించాలనిపించింది. అవ్యక్తరాగం వినిపించాలని పించింది.

అశేషజనం మధ్య నిర్మించిన వేదిక మీదనుంచి స్వామీజీ ఉద్బోధ- లలితంగా మధురంగా ప్రారంభమై, ఆత్మస్థైర్యాన్నిస్తూ, ట్రాన్సులోకి లాక్కు వెళుతున్నట్లుగా గంభీరంగా మారింది.

"అరాచక శక్తులబలం సంఘంలో ఐదు శాతం మాత్రమే.

మంచిబలం తొంభైఐదు శాతం ఉంది.

పిరికి తనం కట్టిపెట్టి భీరత్వాన్ని వదిలిపెట్టి చిత్తశుద్ధితో - అన్యాయాన్ని ఎదిరించే లక్ష్యంతో ముందుకుసాగితే మందిబలం - మంచిబలం వెన్నంటి నీడలా కదిలి వస్తాయి.

ప్రభంజనంలా. 'అరాచకం' పడగమీద 'మంచి' పదఘట్టనంతో మళ్ళీకోలుకోకుండా తొక్కేయవచ్చు అధః పాతాళానికి. సమాజానికి అప్పుడే నిజమైన శ్రేయస్సు."

అవును! అవి పొచికోలు బోధలు కావు! పబ్బం గడుపుకునే మాటలు కావు!! విశ్వాసానికి ఊపిరిపోసే వాస్తవం ఆక్సిజన్!!! నీతికి తీస్తున్న ద్వారాలు!!!

ఎంతమాట అంది ఆ వికృతరూపం! నా ప్రవర్తన బాగుండలేదట!! అందుకే వేధిస్తోన్నదట నన్ను.

ప్రస్తుతపు ఈ నా పంథా మార్చుకుని తనదారికి వచ్చేంతవరకూ నన్ను విడిచిపెట్టదట.

వర్తమాన వ్యవస్థలో తనబలం ఏమిటో చూపిస్తుందట. గడువు విధించింది నాకు. పైగా 'శతసహస్రాంశ గీత' అంటూ ఇంకేవో చెప్పి భయపెడ్తోంది. తన విరాట్ విశ్వరూపం ప్రదర్శిస్తుందట త్వరలో.

అసలా వికృతరూపం ఎంతభయంకరంగా ఉందీ! చీకట్లో తనెంత జడుసుకున్నాడూ! చింపిరి జుత్తుతో కూడిన వలలు! నాలికలు విషాగ్నికీలలు గుమ్మరిస్తున్నట్టే కళ్ళలో రక్తపూలు చూపు మార్చినప్పుడల్లా విస్ఫులింగాలు కురిపిస్తున్నాయి.

బలహీనమైన కాళ్ళమీద బానపొట్ట, రోమాలన్నీ

మిన్నాగుల్లా చురకత్తుల్లా మెలితిరిగి ఉన్నాయి.

ఆ కంఠస్వరం కూడా గమ్మత్తుగా మెత్తగా భీతి గొలిపేలా ఉన్నాయి.

ఏవో కొన్ని గబ్బిలాలు చీకటిరొద చేస్తున్నట్లు ఉఛ్వాస నిశ్వాసాలు. మధ్య మధ్య తొన్నుపోతున్న మాటలు.

కబంధుడి చేతుల్లా ఎంతలావుగా తుమ్మమొద్దుల్లా ఉన్నాయి! ఆ చేతులు మరెంతో పొడవుగా సాగుతున్నాయి. అసలింతకుముందు ఎన్నడూ ఆ వికృతరూపాన్ని చూడలేదు.

ఇటీవలికాలమే దర్శనమిచ్చింది ఓ చీకటి రాత్రిన. అంతా కలలా తోచిందప్పుడు. తుప్పమని నోటితో ఊసింది.

కిరసనాయల డబ్బాల్లా ఉన్న తన తలల్ని ఓ పక్కకి తిప్పగా అక్కడఉన్న అందమైన పూలతోటలో రకరకాల పూలు క్షణకాలంలో మాడిపోయి సహజత్వం కోల్పోయి సహస్రనామం వల్లిస్తూ ఆ వికృతరూపానికి దాసోహమయ్యాయి.

వందిమాగధుల్లా తలవంచి కైవా రం చేశాయి. ఆ విద్యుత్ స్వరం విచిత్రహాసం చేస్తూ నా వంక ఎంతో ఇదిగా చూసింది.

భయంతో నా గొంతు పెగల్లేదు. దిగజారుతున్న చెమటల్లో ముద్దయిపోయాను. అయోమయంగా దానివంక వణుకుతూ చూస్తుండిపోయాను.

తనే పెదవి విప్పింది. "నీ ప్రవర్తన నచ్చటం లేదు. ఇప్పుడు నా చూపు నీ మీద ఉంది. నువ్వు మారాలి నాకు దాసోహం అనాలి. నా దారికి రావాలి. అప్పుడు నీకు అనేక వరాలు ఇస్తాను.

నీ జీవిత విధానాన్నే మార్చేస్తాను. నా నీడలో నీజీవితాన్ని ఆరు భోగాలు పన్నెండు సుఖాలుగా మారుస్తాను. స్టీల్ గిన్నెలో చారుకూడు తినే నిన్ను వెండిగిన్నెలో సూప్ తాగేలా చేస్తాను. నా శక్తి అనన్యం" అంటూ హెచ్చరించి వెళ్ళిపోయింది.

అప్పటికప్పుడే రమకి నిద్రలేపి చెప్పాను.

"ఆ పొదురూ మీరొట్టి అనుమానపు మనిషి! భయస్తులు!! పిరికి వారు!" అంటూ ఎద్దేవా చేసింది

దక్షిణంవైపు తలపెట్టి పడుకో వద్దని ఓ ఉచితసలహా పారేసి తను అటు తిరిగి ముడంకె వేసింది.

ఆ రాత్రి నుండీ నాకు నిద్ర కరువైంది. ప్రతిరాత్రీ ఆ వికృతరూపం విచిత్రస్వరం వస్తూనే ఉంది. నాలో అనుమానబీజం మొలకెత్తి కారణం అన్వేషించ సాగింది.

కొత్తుగా నాకు ప్రమోషన్ వచ్చిన వారంకి అది దర్శనం ఇచ్చిందని స్పష్టంగా తెలిసిపోయింది.

నేను గుమాస్తాగా ఉద్యోగం ప్రారంభించి పదిహేనేళ్ళ అదే సీట్లో గుర్తింపు లేకుండా నిలిచిపోయి చివరకు గుర్తింపు పొంది బ్రాంచ్ మేనేజర్‌గా ప్రమోట్ అయ్యాను.

హోదాతోపాటు విధులు బాధ్యతలు మించి శత్రువులు కూడా పెరిగారు.

ఎదుట ఆత్మీయులుగా ప్రవర్తిస్తున్న వారు చాటున మొహం చిటచిట లాడించుకునేవారు. అంతకు ముందు ఇల్లూ - సైకిలూ - ఆఫీసు భవంతిలో నా కుర్చీబల్ల తప్ప మరేమి తెలీని నాకు ద్విపాత్రాభినయం గురించి తెలియదు.

అందుకే ఇప్పుడు అర్థం కావటం లేదు. హరాయింపు కావటం లేదు.

పైగా నేనొక పుస్తకాల పురుగుని. పుస్తకంలో అక్షరాలు నా ఆరాధ్య దైవాలు. పుస్తకంలో రచించిన సూత్రాలు నా పాలిట గాయత్రీ మంత్రాలు.

అందుకే - అలనాడు అగ్నిప్రవేశం చేసి అగ్ని పునీతగా శ్లాఘింపబడిన సీతమ్మవారిలా క్లీన్ సర్టిఫికెట్ అంటే మక్కువ నాకు. ఉద్యోగంలో ఫండమెంటల్స్ థియరీని తారకమంత్రంగా భావించారు.

అజాతశత్రువుగా ఇంతకాలం మనుతూ వచ్చిన నాకు అజ్ఞాత శత్రువులు ఏర్పడ్డారు. సర్కస్‌ఫీట్లు ప్రారంభమయ్యాయి.

మైకులో నాపేరు వినబడటంతో ఆలోచనల్లోంచి హఠాత్తుగా తేరుకున్నాను.

నేను ఎక్కడున్నా స్కూటరు స్టాండ్ దగ్గరికి చేరాలని వేదికమీదనుండి పక్కింటి వెంకట్రావుగారు పదే పదే పిలుస్తున్నారు..

ఆందోళన నా జన్మలక్షణం కాబట్టి వెంటనే ఆందోళన పడ్డాను.

గుండె దిటవులేని మనిషిని కాబట్టి గుండె మరింత వేగంగా కొట్టుకోవటం ప్రారంభమైంది.

నరాల్లో తీపి ఎక్కువ ఉన్నవాణ్ణే కాబట్టి ఆప్యాయతలు, ప్రేమ లాంటివి వెగటు పుట్టవు. ఇప్పటి దాకా నేలమీద నడిచిన వాణ్ణి కావటాన కాళ్ళు వణుకు కొత్తగాదు.

ఎలాగో అప్పుడప్పుడూ కాళ్ళు నేలకి ఆనిస్తూ, ఆలోచనల్ని పురి పెట్టి ఏమై ఉంటుందాన్న విషయం మీద నిగిడ్చి మనసులో దశావతారాన్ని తలుచుకుంటూ బయటపడ్డాను.

అభిమన్యుడు ఛేదించలేని పద్మ వ్యూహాన్ని నేను ఛేదించాను ఎందుకంటే ఐదు నిమిషాల్లో స్కూటర్ స్టాండుకు చేరానుకాబట్టి. తరుగులో కూడా మెరుగు ఉంటుందన్న దానికి ఓ గొప్ప ఉదాహరణ ఆ తరువాత తెలిసింది. లేకుంటే దారిలోనే గుండాగి మరణించుండే వాణ్ణి.


ఆయన చెప్పింది ఒక్క అక్షరం కూడా నా చెవికి చేరలేదు. గాలివాటంకి పక్కకి తోసుకుపోయాయి కాబట్టి.

గుమ్మంలో స్కూటర్ దిగేటప్పుడికి వంటింట్లో గుండెలు బాదుకుంటూ రమ కనిపించింది.

ఆ ప్రక్కనే నా కూతురు శైలజ నల్లని దుప్పటి ముసుగేసుకొని తలంతా చిందర వందరై పందులు ముట్టెలతో కుల్లబొడిచిన దుంపలా కనిపించింది.

ఏదో అఘాయిత్యం జరిగిందని తెలుస్తూనే ఉంది! ఎక్కణ్ణుంచో ప్రారంభమైన భయం కుప్పకూలేలా చేసింది. ఆశ్రమంపై ఏనుగుల మంద దాడిచేసి చిందరవందర చేసినట్లుగా ఇల్లంతా - ఫ్లవర్‌వాజ్ ముక్కలతో, టీవీ పార్టులతో కలవరంగా ఉంది.

ఆ పక్కింటి వాళ్ళూ, ఈ పక్కింటి వాళ్ళూ అందరూ నా రాకతో రమకి మరోసారి సానుభూతిని పంచి తప్పుకున్నారు.




కె.రాధ, వైఫాఫ్ః శ్రీనివాస్, పోస్ట్ః మల్లారం, మంః తాడిచెర్ల -505 184. జిల్లాః కరీంనగర్.

లోపల బితుకు బితుకు మంటున్నా ఏం జరిగిందో అడిగి తెల్సుకో వాల్సిన బాధ్యతంటూ ఒకటి ఉంది కాబట్టి అడిగాను.

ఈదురుగాలి సుడిగాలైంది. రమ నన్ను అల్లుకుపోయింది. శైలజ నేలకి అంటుకుపోయింది.

ఏ భార్యా, భర్తకి ఆ విషయాన్ని అంత పచ్చిగా చెప్పదేమో కానీ, రమ చెప్పింది. కడుపులో కదిలించిన మంట స్వచ్ఛంగా బైటపడితే అంత పచ్చిగా ఉంటుంది కాబోలు.

విషయం తెల్సింది. రమకి వస్త్రాపహరణమైతే, శైలజకి దాన్నిమించి మరొకటి జరిగింది. అటు నింగికి ఇటు నేలకి చెందకుండా శూన్యంలోకి లాగుతున్న ఫీలింగ్.

గాయిత్రి ని ఎంత భక్తితో, ఇష్టంతో ప్రేమిస్తున్నానో అంతే సమానంగా విధి నిర్వహణని నిర్వర్తించిన ఫలితం ఇది.

ఇప్పుడు జరిగిన దానికి ఎప్పుడో పునాదిపడింది.

ఆరోజు-

ఇంటర్వ్యూలు ప్రారంభించబోతుండగా ఫోను వచ్చింది. ఫోను చేసింది ఐదేళ్ళకి ఒకసారి కనిపించే ఘరానా గ్లామర్.

'సహకరించండి - సంపాదించుకోండి' అంటూ చెప్పాడు బంధుత్వాలు కలుపుకుందామన్నాడు. తన క్యాండేట్‌ని చూడమన్నాడు. తను నిత్యం నన్ను చూస్తానన్నాడు.

నా బలహీనత తెల్సిందే కదా! 'ఆ బంధుత్వాలు ఏమాత్రం నచ్చవునాకు' అని తెగేసి చెప్పాను.

ధీమాగా వచ్చిన క్యాండెట్లు డ్రామా బెడిసికొట్టి వెళుతూ వెళుతూ హెచ్చరించి వెళ్ళాడు. 'సారీ' పదం ఎంత కామనైందో, - అంతు చూస్తా కూడా అంతే అనుకున్నాను.

ఇప్పుడు వీరంగమాడి వీరవిహారం చేసి తన 'సత్తా' ఏమిటో చూపించి వెళ్ళాడువాడు. మగాడి 'సత్తా' అదేకదా!

కేసు పెట్టాను.

రాత్రిళ్ళు కునుకు రావటం లేదు. మనసులో దిగులు తరగటం లేదు. అదిగో అప్పుడు వచ్చిందా వికృత రూపం.

'నా బలం ఏమిటో చూశావా?'' అంటూ గేలి చేసింది.

తన మాట విననందుకు ఫలితం ఇది అంది. తనతో ఐక్యం చెందితే ఇలాంటివి ఉండవు కదా అంటూ 'కుమతీ' శతకం విప్పింది.

ఇప్పటికైనా మించిపోయింది లేదు. శైలజ బతుకు పండిస్తానని హామీ ఇచ్చింది. 'తెల్లవారేటప్పటికి మనసు మార్చుకోకపోతే, మరింత మోతాదు పెంచుతాన'ంది.

'అప్పుడు అన్యధా శరణంనాస్తి అంటూ పాదాలమీద పడినా ప్రమోజనం ఉండదంటూ హెచ్చరించింది.

నాకిప్పుడు భయం వేయటం లేదు.

స్వామిజీ మాటలు చెవుల్లో గింగురు మంటున్నాయి. ఏదో శక్తి నిప్పుల్లా నన్నావహించింది. అప్పుడు తెల్లవారుతోంది.

తూర్పున వెలుగు గుమ్మడిపూల తోరణం కట్టినట్లుగా ఉంది. తమలపాకు, మొవ్వ తాటాకు కలిపి నలిపిన ఉచ్ఛిష్టవర్ణంలో సూర్యుడు పైకి వస్తున్నాడు.

నాలో తెగింపు. ఆ వికృత రూపానికి నాసత్తా తెలియపర్చాలనుకున్నాను.

దాని స్థాయి ఏంటో నిరూపించ దల్చుకున్నాను. భవిష్యత్తులో యువత చేతిలో దాని భవిత ఏంటో ప్రత్యక్షంగా చూపించదల్చుకున్నాను.

నన్ను అనుసరించమని, నేను ముందు నడుస్తున్నాను.

బలంగా అడుగులువేస్తూ... గిరిత్రాచులా దేకుతూ పాకుతూ అది నన్నునసరిస్తోంది!

చాలాసేపు నడిచాం! పూరు శివార్లలోకి చేరాం!

అక్కడంతా పచ్చనిచేలు, పసిడి రాసులు గుమ్మరించినట్లున్నాయి. కానీ, మొక్కమొక్కని కబళించాలని పురుగులు తహ తహ లాడ్తున్నాయి.

కొంతమంది రైతులు పురుగులమీదకి మందు పిచికారీ చేస్తున్నారు. మందు సోకటం ఆలస్యం, ఘాటుకి పురుగులు మెలి తిరిగి చచ్చిపోతున్నాయి.

వికృతరూపంకేసి తిరిగి ''నీ బతుకూ అంతే...'' మందు చల్లేది రైతులు కారు రేపటి యువత, ఆలోచనలే మందు, ఆ పిచికారి క్షాళనంచేసేమార్గాలు. ఈ గడ్డది-వ్యధామం'' అన్నాను స్థిరంగా.

ఆ వికృతరూపం వికటాట్టహాసం చేయబోయింది. నాలో అంత శక్తి ఎలా వచ్చిందో తెలియదు. ఖాండ్రించి ఉమ్మేశాను.

అచేతనమైంది వికృతరూపం.

గట్టుమీద మా మధ్య జరుగుతున్న దాన్ని రైతులు పరికించినట్లున్నారు. అందరూ పరుగున వస్తున్నారు.

ఒక్కరు వందగా, వందమంది వేలుగా... అందరి చేతుల్లో కర్రలు... కావు కర్రలు అవి ధర్మదండనాలు.

ఉరుకుల పరుగులతో చేయి చేయి కలుపుకుని సమతారాగం ఆలపిస్తూ... పరిమళాల విరజిమ్ముకుంటూ... తల్లిభారతికి వందనాలు పాడుకుంటూ...

భగవంతుడి గాలిసోకిన సైతానులా వణికిపోతూ... ఆ వికృతరూపం పరుగులంకించుకుంది.

ఏ ఊరు వెళ్ళినా... ఎవరిదగ్గరికి వెళ్ళినా ఇక్కడ జరిగిన పరాభవంలాంటిదే... సంఘటిత శక్తితో చేస్తే... ఆ వికృత రూపానికి ఈ దేశంలో మనుగడ ఉంటుందా?

అప్పుడు ఇళ్ళకి తాళాలూ, మనసులకి గొళ్ళాలూ, మనుషులకి భయాలూ ఉంటాయా?

ఆ తరువాత-

ఆఫీసుకి వెళ్ళగానే మూడు ఫోన్లు వచ్చాయి. ఒకటి మా చైర్మన్లనుండి నా సిన్సియార్టీని మెచ్చుకుంటూ,

రెండు మా లాయరు 'మనం కోర్టులో గెలిచాం, వాళ్ళకి శిక్ష పడింది' అంటూ,

ఇక మూడో ఫోన్ కొందరు యువకులు చేశారు 'ఆలోచించే యువత ఉంది...' అంటూ...

చీకటిని చీల్చే వెలుగు రేఖలు వారు.

ఆ మాత్రం అండచాలదూ ఈ వ్యవస్థకీ, నాబోటి వారికీ. ఇప్పుడు నాకు దిగులు లేదు శైలజ భవిత గురించి-

జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం,
శివాలయం ఎదురుగా,
సత్యన్నారాయణపురం, హనుమాన్ వీధి,
విజయవాడ - 520 011.

## శత్రువు

"నాకు వంద సంవత్సరాలు వయసుంది. ఈ ప్రపంచములో నాకు విరోధులే లేరు" అన్నారు మార్కండేయ తాతగారు.

"అలాగా - మిమ్మల్ని ఎలా అభినందించాలో తెలీటం లేదు" అభినందించాడు మనవడు.

"నా శత్రువులందరూ చనిపోయారు" నవ్వుతూ చెప్పారు తాతగారు.

-నూతికట్ల రవి
65-16-17, ద్వారకానగర్,
కాకినాడ-3



"బాబు రెండు గంటల నుండి ఏడుస్తున్నాడు గదా! వాణ్ణి పడుకోబెట్టరాదంటే?"

"బాబు ఏడ్వటం లేదండీ, వాడెప్పుడో నిద్రపోయాడు. నేనే పాట పాడుతున్నాను."

-ఎం.ప్రవీణ్ గౌడ్,
లింబారెడ్డి రైస్‌మిల్ దగ్గర
పెర్కిట్-503 224
జిల్లా:నిజామాబాద్.